అందని త్రీఫేజ్ విద్యుత్

సబ్‌స్టేషన్ ఉన్నా సేవలు శూన్యం

- సింగిల్ ఫేజ్‌తో తరచూ అంతరాయం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు, రైతులు



ఉప్పుగల్లులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

జఫర్‌గఢ్ : అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉప్పుగల్లులో మాత్రం సబ్‌స్టేషన్ ఉన్నా ఇప్పటి వరకు గ్రామానికి 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందడం లేదు. సింగిల్ ఫేజ్ కరెంటు మాత్రమే ఇస్తుండడంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో గృహ వినియోగదారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2015, సెప్టెంబర్‌లో ఉప్పుగల్లు గ్రామంతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఫాంనూర్ గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యను నివారించేందుకు గాను ఉప్పుగల్లులో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మూడు ఫీడర్ల కింద గృహాలకు సంబంధించిన 14, వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన 80 ట్రాన్స్‌ఫార్మర్లు పని చేస్తున్నాయి. వీటి ద్వారా ఉప్పుగల్లు, రోగట్ల, ఫాంనూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో గృహాలకు 1,050 విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇందులో కేటగిరి-2లో 130 విద్యుత్ కనెక్షన్లు వినియోగంలో ఉన్నాయి. వీటితో పాటు వ్యవసాయ బోరు బావులకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు కూడా ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న గ్రామాల్లో త్రీఫేజ్ కరెంటును ఏర్పాటు చేయడంతో పాటు గ్రామానికి 24 గంటల పాటు కరెంటు తప్పని సరిగా అందించాల్సి ఉంటుంది. మండలంలోని ఉప్పుగల్లులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా గ్రామానికి ఇప్పటి వరకు సింగిల్ ఫేజ్ విద్యుత్ మాత్రమే సరఫరా చేస్తుడడంతో తరచుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వ్యవసాయ బోరు బావుల వద్ద, లేక ఇళ్లకు సంబంధించిన విద్యుత్‌కు సంబంధించి ఏ చిన్న సమస్య వచ్చిన పూర్తిగా విద్యుత్ సరఫరాను నిలిపి వేయాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి సమయంలో గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే గ్రామానికి త్రీఫేజ్ కరెంటు సరఫరా విషయంలో గ్రామస్తులు పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సబ్‌స్టేషన్ ద్వారా త్రీ ఫేజ్ ద్వారా 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలి



ఉప్పుగల్లు గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఏండ్లు గడుస్తున్నది. ఈ సబ్‌స్టేషన్‌తో గ్రామానికి త్రీ ఫేజ్ కరెంటు ఇవ్వాలి. అయినా ఇప్పటి వరకు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సింగిల్ ఫేజ్ వల్ల ఏ చిన్న సమస్య వచ్చిన కరెంటును నిలిపి వేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కరెంటు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇప్పటికైన గ్రామానికి త్రీ ఫేజ్ ద్వారా 24 కరెంటు ఇవ్వాలి.

– పులి ధనుంజయ, స్థానికుడు

సింగిల్ ఫేజ్‌తో ఇబ్బందులు



గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న ఇప్పటి వరకు సింగిల్ ఫేజ్ కరెంటు మాత్రమే ఇస్తున్నారు. కాగా వ్యవసాయ బావుల వద్ద, గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చిన పూర్తిగా కరెంటును నిలిపి వేస్తున్నారు. దీనివల్ల తరచుగా విద్యుత్ అంతరాయం ఏర్పడి రైతులు, గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నాం.

– బేతి రాజిరెడ్డి, రైతు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి టౌన్ : తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వరూప ఆదివారం కోరారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల్లాలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరి 1వరకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 23న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

భౌతిక శాస్త్రంలో సుమతికి డాక్టరేట్



దేవరుప్పుల : మండల కేంద్రానికి చెందిన జోగు సుమతి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భౌతిక శాస్త్రం విభాగంలో డాక్టరేట్ పట్టాకు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని కొత్తవాడకు చెందిన జోగు నారాయణ,ఐలమ్మల కుమార్తె జోగు సుమతికి ఇదే మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన మేడ యాదగిరితో వివాహం జరిగింది. దళిత సామాజికవర్గానికి చెందిన సుమతికి డాక్టరేట్ పట్టా పొందాలనే సంకల్పానికి ఆమె భర్త ప్రోత్సాహం ఫలించింది. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు డాక్టర్ కలీం అహ్మద్ జలీలి పర్యవేక్షణలో భౌతికశాస్త్రంలో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను సాధించింది. డాక్టరేట్ పొందడంతో గ్రామస్తులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్యశిబిరం



చిల్పూరు : గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని శ్రీసాయి మెడికల్ స్టోర్ నిర్వాహకుడు నేరెళ్ల నరేందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అజర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది వైద్యపరీక్షలు చేయించుకోగా ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నాన్సి, శివ, ప్రవీణ్‌లతో పాటు ఉట్కూరి సునయ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



దేవరుప్పుల : నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్ నిలుస్తోందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని చౌడూరులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును మంగ పద్మకు అందజేశారు. కార్యక్రమంలో రమణచారీ, నాయకులు రాజయ్య, ఇనుముల భిక్షపతి, హుస్సేన్, దొంతూరి సత్తయ్య, ఆకుల అంజయ్య, ఇనుముల కుమారుస్వామి, కొండయ్య, నర్సయ్య, శ్రీనివాస్, ఎడవెల్లి శ్రీనివాస్, గౌస్, మేకల మల్లయ్య పాల్గొన్నారు.

'త్రైత సిద్ధాంతం ప్రచారం'

లింగాలఘణపురం : మండలంలోని సిరిపురంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక జనగామ, భువనగిరి, చేర్యాల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత గ్రంథంపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దేవేంద్ర, పంచాక్షరి, శ్రీనాథ్, శంకర్, లక్ష్మీనారాయణ, లింగస్వామి, భాస్కర్, రాము, శాంతికుమారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

'మృదుల కిడ్స్'లో ముగ్గుల పోటీలు



జనగామ : బాలాజీనగర్‌లోని మృదుల కిడ్స్‌లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలకు 50 మంది మహిళలు హాజరయ్యారు. విజేత మహిళలకు బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లింగాలఘణపురం : మండలంలోని వనపర్తి పీవీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సుధాగాని స్నేతిక, గడ్డం రుద్ర రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ పప్పు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లాలో విశ్వం ఎజూటెక్ నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పరీక్షలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

పంటలకు సాగునీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న రైతులు, అధికారులు

జఫర్‌గఢ్ : మండలంలోని రైతులు సాగుచేస్తున్న పంటలకు నీరు అందించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు సంబంధిత రైతులతో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి ఆదివారం నీటిని విడుదల చేశారు. ఉప్పుగల్లు, కూనూర్, కోనాయిచలం గ్రామాలకు చెందిన రైతులు ధంసా ఫీడర్ చానల్ ద్వారా తమ పంటపొలాలకు సాగునీరు అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి ధంసా ఫీడర్ చానల్ ద్వారా రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో ఉప్పుగల్లు గ్రామ రైతులతో కలిసి అధికారులు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని రిజర్వాయర్లు, దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కాల్వల మరమ్మతుతో పాటు పైపులైన్లు, పంపు హౌస్‌ల నిర్మాణ పనులు చేపట్టి ఈ యాసంగిలో సాగునీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, కాంగ్రెస్ నాయకులు పొరెడ్డి సత్యనారాయణరెడ్డి, కోరుకొప్పుల రాజుతో పాటు పలువురు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే మెడికల్ వ్యర్థాలు



ఆరుబయట పడేసిన సిరంజీలు, మందులు

జనగామ : పట్టణంలోని గణేశ్ స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో రోడ్డు పక్కనే మెడికల్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. విద్యార్థులు ఆడుకునే స్థలంలో కాలం చెల్లిన మందులు, ఉపయోగించిన సిరంజీలను నిర్లక్ష్యంగా పడేశారు. విద్యార్థులు ఆడుకుంటూ వెళ్లి ఉపయోగించిన సిరంజీలను ముట్టుకుంటే ఇక అంతే సంగతి. దీర్ఘకాలిక రోగులకు ఇచ్చే ఇంజక్షన్లు అందులో ఉండి ఉంటే పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాలు రోజు తిరుగుతున్నా.. ఈ చెత్త కనిపించకపోవడం గమనార్హం. వీటిని ఎవరు పడేశారు అనే దానిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్ డిమాండ్ చేస్తున్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల మండల కమిటీ ఎన్నిక



రఘునాథపల్లి: ఎన్నికైన కమిటీ సభ్యులు



బచ్చన్నపేట: ఆర్‌ఎంపీ, పీఎంపీల మండల కమిటీ సభ్యులు

రఘునాథపల్లి : ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ వైద్యులు ఆదివారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించి సంఘం జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్యనారాయణ సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మంచోజు లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి కుమార్, ఉపాధ్యక్షుడు మైలారపు అంజనేయులు, కోశాధికారి ఎండీ ఖాజాపాషా, గౌరవ అధ్యక్షుడు మడిపోజు యాదగిరి, కార్యదర్శి కేమిడి భైరయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన రమేశ్, సురేందర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లక్ష్మినారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేసే ఆర్‌ఎంపీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బచ్చన్నపేట మండల కమిటీ..

బచ్చన్నపేట : ఆర్‌ఎంపీ, పీఎంపీల మండల కమిటీని ఆదివారం మండలంలోని గోపాల్‌నగర్‌లో గల పద్మశాలి భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బండారి అంజనేయులు, ఉపాధ్యక్షుడిగా దొంతుల ఉమామహేష్, గౌరవ అధ్యక్షుడిగా బైరగోని కనకయ్య గౌడ్, కార్యదర్శిగా రాపెల్లి చక్రపాణి, కోశాధికారిగా నారా ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ఇటికాల అభినయ్, కొంతం రాము, మదూరి రమాకాంతం, బత్తుల రాజేందర్, ఎలికట్టి శ్రీనివాస్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు అల్లి ఉమాకాంతం, కేతోజు భాస్కర్, మంతెన రమేష్, కృష్ణ, ఎర్రం రాజు, అబ్దుల్ సత్తార్ పలువురు పాల్గొన్నారు.

యువచైతన్య ఆటో యూనియన్..



జనగామ రూరల్: ఆటో యూనియన్ సభ్యులు..

జనగామ రూరల్ : మండలంలోని గానుగుపహాడ్‌లో యువ చైతన్య ఆటో యూనియన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా దడిగ తిరుపతి, ఉపాధ్యక్షుడిగా ముత్యాల రాజు, కార్యదర్శిగా మలగ మహేందర్, సలహాదారుడిగా గుర్రం నాగేష్, కోశాధికారిగా పేరబోయిన మధు, కమిటీ సభ్యులుగా ముక్కెర కరుణాకర్, ఎండీ యాసీన్, గోనెల మల్లేష్, శానబోయిన సందీప్, భాస్కర్, రమేష్, సందీప్, రవి, రాజును ఎన్నుకున్నారు.

సీనియర్ సిటిజన్స్ సేవలు అవసరం

- టీఏఎస్‌సీఏ డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్(టీఏఎస్‌సీఏ)–2025 నూతన డైరీని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో డైరీని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. యువత సరియైన మార్గంలో పయనించడానికి సీనియర్ సిటిజన్స్ సేవలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో సొంత భవనం అవసరమన్నారు. సంఘ అధ్యక్షుడు తీగల సిద్దిమల్లయ్య, కార్యదర్శి తాళ్ల వెంకటమల్లారెడ్డి, కోశాధికారి వనమాల రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లాడి ప్రభాకర్ రావు, గౌరవ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

జనగామ పట్టణంలోని 17వ వార్డులో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతూ స్థానిక కాలనీ వాసులు ఆదివారం ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ గోడ నిర్మాణంతో 40 కుటుంబాలకు ఇబ్బందిగా ఉందని సుంకరనేని వెంకటేశ్వర్లు, నర్సింహాచారి, కూరపాటి రాజచంద్ర, కేమిడి కృష్ణ, ముద్దం మణి, పూజారి దీపు తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై ఆరా తీసి తనవంతు సహకారం అందించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా కల్పించారని వారు తెలిపారు.

నేటి నిరసనను జయప్రదం చేయండి

దేవరుప్పుల/ పాలకుర్తి: రైతులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు నేడు(సోమవారం) మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దేవరుప్పుల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, పాలకుర్తి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ పిలుపునిచ్చారు. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని రూ.12 వేలకు కుదించడంతోపాటు రైతులను మోసం చేసే చర్యలను నిలువరించేందుకు చేపట్టే ఆందోళనకు పార్టీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఫిబ్రవరి 7న రథయాత్ర..

ధర్మసాగర్ : వెయ్యి గొంతులు, లక్ష డప్పుల రథయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న వెయ్యి గొంతులు, లక్ష డప్పులతో మాదిగ, మాదిగ ఉపకులాల మహా ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం న్యాయమైన ఉద్యమం అని, రాజకీయ పార్టీల మద్దతు కలిగిన ఏకైక ఉద్యమమని అన్నారు.

మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి చేస్తానని, వారి సంఘానికి మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని శివునిపల్లిలో మున్నూరుకాపు పరపతి సంఘం మొదటి వార్షికోత్సవ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు, మాజీ సర్పంచ్‌లు పోగుల సారంగపాణి, కొంతం శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం, వేముగంటి రాంప్రసాద్,వాసం శ్రీధర్, గాండ్ల సతీష్, తోట భిక్షపతి, వెంకటేశ్వర్లు, సోమయ్య, రవి, ఉపేందర్, జగన్, రాహుల్, లక్ష్మీనారాయణ, రమేష్, కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఘన్‌పూర్ రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన మొత్తం 35 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు.

గోపా ఆధ్వర్యంలో వనభోజనాలు



డీపీఓ స్వరూపను సత్కరిస్తున్న గోపా ప్రతినిధులు

జనగామ : పసరమడ్ల శివారులోని మామిడి తోటలో జిల్లా గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(గోపా) ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ వనభోజనాలకు వెళ్లారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల అంజనేయులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి దూడల రాజాసంపత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి, డీపీఓ నాగపురి స్వరూప, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండి సాయన్న, ఉపాధ్యక్షుడు కుర్రెముల యాదగిరి, కార్యదర్శి జీవీ శ్రీనివాస్, కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు, వెంకన్న, అంబాల నారాయణ, ఎలికట్టె విజయ్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంతో పాటు గోపా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అతిథులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య
- నేటిధర్నాను విజయవంతం చేయాలి



జఫర్‌గఢ్‌లో మాట్లాడుతున్న రాపర్తి సోమయ్య

జఫర్‌గఢ్ : ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులతో పాటు తదితర సమస్యలపై (నేడు) సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాలు లేని పేదలకు 120 గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గుడిసెలు వేసుకున్న పేదలందరికి పట్టాలు ఇచ్చి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కాట సుధాకర్, తాటికాయల రేణుక, బంగారు చిరంజీవి, ఎర్ర రవి, తోట నర్సయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు పార్టీ శ్రేణులు, పేదలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ కోరారు. ఘన్‌పూర్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో వేలాదిమంది పేదలకు ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు అందించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నేడు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కడెపాక యాకయ్య, కుర్ర ఉప్పలయ్య, భాస్కర్, ఐలయ్య, రాజు, మోహన్, నర్సింహులు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కొడకండ్ల : మండలంలోని మైదంచెరువు తండాకు చెందిన ధరావత్ రాజు ఆదివారం మృతి చెందాడు. కాగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్ నాయక్‌లు, రాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు సిద్ధు, బాలకిషన్, భాస్కర్, రవి, మల్లేష్, రాములు, భిక్షపతి, రాము తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా: మాజీ మంత్రి దయాకర్‌రావు



బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామవరం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డిని ఆదివారం దయాకర్‌రావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

జానపద కళాకారుడు మురళి మృతి



మురళి (ఫైల్)

దేవరుప్పుల : మండలంలోని కడవెండికి చెందిన జానపద కళాకారుడు పన్నీరు మురళి ఆదివారం మృతి చెందారు. జీవనోపాధి కోసం కొడకండ్ల మండలం గిర్నితండాలో ఉంటున్న నాలుగున్నర దశాబ్దల కిందట నుంచి సామాజిక నాటకాల ప్రదర్శనలో గాయకుడిగా రాణించారు. మురళి మృతిపై పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేషం, తాటిపెల్లి మహేష్, యక్షగాన కళాకారులు నల్ల యాదగిరి, కమ్మంపాటి కొండయ్య, బత్తిని యాదగిరి తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

స్వగ్రామంలో కనకయ్య అంత్యక్రియలు



కనకయ్య (ఫైల్)

బచ్చన్నపేట : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు బాంబుల ఫ్యాక్టరీలో జరిగిన పేలుళ్లలో మండల కేంద్రానికి చెందిన మార్క కనకయ్య (54) గాయపడి చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస వీడిచాడు. కాగా పోస్టుమార్టం అనంతరం కనకయ్య మృతదేహన్ని స్వగ్రామమైన బచ్చన్నపేటలోని బీడీకాలనీకి తీసుకు వచ్చారు. అయితే మృతుడి కుమారుడు వినయ్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా కూతురు చంద్రిక లండన్‌లో ఉద్యోగం చేస్తోంది.దీంతో కూతురు వచ్చే వరకు అంత్యక్రియలను నిర్వహించలేదు. కూతురు వచ్చాక ఆదివారం అంత్యక్రియలు పూర్తిచేశారు.

నలుగురి రిమాండ్

దేవరుప్పుల : పాత సామాన్లు కొనుగోలు చేస్తాం అంటూ తాళం వేసి ఉన్న ఇంట్లోని సామగ్రి ఎత్తుకెళ్లిన నలుగురిని ఆదివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన ముగ్గురు మహిళలు, ఓ వ్యక్తి కలిసి ఆటోలో పాత సామాను కొనుగోలు పేరిట దేవరుప్పులలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఈదునూరి కృష్ణారెడ్డి ఇంటికి కన్నం వేసి సామాగ్రి ఎత్తుకెళ్లారు. ఈ విషయమై ఈదునూరి సోమిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నలుగిరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన శ్రీనివాస్

బచ్చన్నపేట : మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను మండలంలోని కొడవటూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మిన్నాలపురం శ్రీనివాస్ కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

జనగామ రూరల్ : హైదరాబాద్‌లోని కులీ కుతుబ్ షా స్టేడియంలో నిర్వహించిన సంవిధాన్ జిందాబాద్ బహిరంగ సభకు ఆదివారం టీపీసీసీ మైనార్టీ నాయకుడు జమాల్ షరీఫ్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో అష్షు, రఫిక్, హసన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'పొలంబాట'

పెద్దవంగర : రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే పొలం బాట కార్యక్రమం చేపడుతున్నట్లు ఏఈ రమేష్ బాబు తెలిపారు. ఆదివారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో విద్యుత్ అధికారులతో కలిసి పొలం బాట కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలపై స్థానిక రైతులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవగాహన లోపంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని వివరించారు. గృహాల్లో నాణ్యమైన వైరింగ్ చేసుకోక పోవడం, వ్యవసాయ మోటార్ల స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించక పోవడం వంటి కారణాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిన స్తంభాలు మారుస్తామని, పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.